ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసిన డీఎం, అధికారులు



హెచ్‌సీయూ డిపోలో డ్రైవర్ మాణిక్యంను సత్కరిస్తున్న డిపో మేనేజర్ ఎంఎంరెడ్డి



డ్రైవర్ మాణిక్యంను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్, చిత్రంలో డీఎం ఎంఎంరెడ్డి, అధికారులు

రాయదుర్గం: తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌ను గచ్చిబౌలి ఆర్టీసీ డిపో అధికారులు బుధవారం కలిశారు. డీఎం ఎంఎంరెడ్డి, సీఐ ప్రశాంత్‌కుమార్, ఉద్యోగ విరమణ చేసిన ఎం మాణిక్యం కుటుంబసభ్యులతో కలిశారు. ఈ సందర్భంగా విధులు సక్రమంగా నిర్వర్తించిన రిటైర్డ్ డ్రైవర్‌ను సజ్జనార్ సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అలాగే వారు కూడా సజ్జనార్‌ను సత్కరించారు.

సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు, ప్రయాణికులే ముఖ్యం

సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులు, ప్రయాణికులు ఎంతో ముఖ్యమని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంఎంరెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని డిపోలో డ్రైవర్ ఎం మాణిక్యం వీడ్కోలు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధికారులు , ఉద్యోగులు ఆయనను సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించినప్పటి నుంచి ఆక్యుపెన్సీరేషియో గణనీయంగా పెరిగిందన్నారు. ఉద్యోగులు ప్రయాణికులే దేవుళ్లుగా సంస్థ భావిస్తున్నందున వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వేళలను విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ప్రశాంత్‌కుమార్, ఉద్యోగులు, మాణిక్యం కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని శిల్పారామంలో కూచిపూడి నృత్యం చేస్తున్న యువతులు

శిల్పారామంలో అలరించిన కార్యక్రమాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ శిల్పాబజార్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటున్నది. చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను గురువారం సందర్శకులు కొనుగోలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆంఫిథియేటర్‌లో వేలూరి లక్ష్మి నిర్వహించిన వీణా వాయిద్యం అలరించింది. మృదంగం అనిల్‌కుమార్ సంగీత సహకారాన్ని అందించారు. గౌతమీరాణి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. ఇందులో గణేశ స్తుతి, ముద్దుగారే యశోద, రామ కోదండ రామ, మూషికవాహన, వీణ పుస్తక దారిని, అదిగో అల్లదిగో తదితర అంశాలను కళాకారులు ప్రణవి, శ్రీవేద, అనీక్షిత, శ్రేయన్షి, నందిని, రిత్విక పాల్గొని ప్రదర్శించారు.

ట్రాఫిక్ నిబంధనలపై 2కే వాక్



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్టపై 2కే వాక్ నిర్వహిస్తున్న విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు కట్టపై కళాశాల విద్యార్థులతో కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని (2కే వాక్) నిర్వహించారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని 2కే వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. హెల్మెట్ పెట్టుకోవడంతో ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. అతి వేగంతో డ్రైవింగ్ చేయడంతో ప్రాణాలకే ప్రమాదమన్నారు. కూకట్‌పల్లిలో ఎక్కువగా కళాశాలలు ఉన్నాయని ఒకేసారి విద్యార్థులు బయటకు రావడంతో ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. జీబ్రా క్రాసింగ్‌పై ట్రాఫిక్ సిగ్నల్స్ గమనిస్తూ రోడ్డు దాటాలని విద్యార్థులకు సూచించారు. పలు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నగేష్, ఆర్ఐ శేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నాలెడ్జ్ సిటీలో చలాన్ల మోత



ధ్వంసమైన తోపుడు బండ్లు

గచ్చిబౌలి: కుమారీ ఆంటీ హోటల్ మూసివేత వివాదాస్పదం కావడంతో ట్రాఫిక్ పోలీసులు చలాన్ల మోత మోగించారు. బుధవారం మధ్యాహ్నం మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణవీర్ రెడ్డి, రాయదుర్గం ట్రాఫిక్ సీఐ గణేష్ పటేల్ సిబ్బందితో ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఉన్న నాలెడ్జ్ సిటీలోని రోడ్డుకు వచ్చారు. అప్పటికే రోడ్డుపై వందలాది వాహనాలు పార్కింగ్ చేసి ఉండటంతో ఒక్క వాహనాన్ని వదిలిపెట్టకుండా చలానా విధించాలని అధికారులను ఆదేశించారు. ఏసీపీ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసులు చలాన్ల మోత మోగించారు. కనిపించిన ప్రతి వాహనానికి చలాన్ వేశారు. కొన్ని బైక్‌లను రికవరీ వ్యాన్‌లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ పార్కింగ్ చేస్తూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తే సహించబోమని ఏసీపీ రణవీర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫుట్‌పాత్‌పై వ్యాపారాలను తొలగించడం తమ పని కాదని, ఇలా అధికారులు చూసుకుంటారని ఆయన పేర్కొన్నారు. అయితే మధ్నాహ్నం తర్వాత ఫుడ్ కోర్టుల ముందు యథావిధిగా వాహనాలను పార్కింగ్ చేయడం గమనార్హం.

తోపుడు బండ్ల ధ్వంసం

గచ్చిబౌలి: కుమారీ ఆంటీ హోటల్ మూసివేత వివాదం సమసిపోక ముందే జీహెచ్‌ఎంసీ సిబ్బంది తోపుడు బండ్లను ధ్వంసం చేయడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం ఉదయం శానిటేషన్ పనులను పర్యవేక్షించేందుకు శేరిలింగంపల్లి సర్కిల్‌కు వచ్చిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ దుర్గం చెరువు రోడ్డు వెంట ఉన్న తోపుడు బండ్లను తొలగించాలని ఆదేశించారు. దీంతో శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ నేతృత్వంలో సర్కిల్ ఉప వైద్యాధికారి నగేష్, జీహెచ్‌ఎంసీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చిరు వ్యాపార సముదాయాలను తొలగించారు. తోపుడు బండ్లను పూర్తిగా ధ్వంసం చేశారు. సమాచారం ఇస్తే తోపుడు బండ్లను తీసుకెళ్లే వారమని, ధ్వంసం చేయడం ఏమిటని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



చలాన్ రాస్తున్న రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు

కోనసీమ (పల్లె) జాతరకు చకచకా ఏర్పాట్లు

- పట్టణంలో ప్రబల తీర్థం వేడుకలు
- నల్లగండ్ల అపర్ణ సరోవర్‌లో ఈ నెల 2,3,4 తేదీల్లో నిర్వహణ



అపర్ణ సరోవర్‌లో ప్రబలతీర్థం వేడుకల్లో భాగంగా శివపార్వతులను ఊరేగిస్తున్న దృశ్యం (ఫైల్)

శేరిలింగంపల్లి: 400 వందల ఏళ్ల చరిత్ర ఉన్న కోనసీమ ప్రబల తీర్థం వేడుకలకు శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ ముస్తాబవుతోంది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు చకచకగా ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోనసీమలో ప్రబల తీర్థం వేడుకలకు 400 ఏళ్ల చరిత్ర ఉందని అపర్ణ సరోవర్‌వాసులు పేర్కొంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గన్నతోట వద్ద జరిపే ఈ వేడుకల్లో ఏకాదశ ప్రబలు 11 గ్రామాల నుంచి తరలివస్తాయి. అవి జగ్గన్నతోట వద్ద కలిసి తీర్థం జరిపిన తర్వాతా ఆయా గ్రామాలకు తిరిగివెళ్తాయి. ఏకాదశ రుద్రులను ఒకే చోట చేర్చి పూజిస్తారు. గ్రామీణ ప్రాంతంలో నిర్వహించే జాతర వలే ప్రబల తీర్థంలో కూడా రంగుల రాట్నాలు, చిలక జోస్యం, కుమ్మరుల కుండల తయారీ విధానం, వీధి గారడీ, బుజ్జి బూరెలు, పీచు మిఠాయిలతో పాటు చేనేత, హస్తకళల స్టాల్స్ వంటివి ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా రథం, ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

ఈశ్వరుని రూపంగా ప్రబల తీర్థం..

కోనసీమలో ఈశ్వరుని రూపంగా ప్రబలను కొలుస్తారు. వెదురు కర్రలు, రంగు, రంగుల నూతన వస్త్రాలు, కాగితాలతో తయారు చేస్తారు. అనంతరం వివిధ రకాల పూలతో అలంకరించి శివపార్వతులను ప్రబల్లో ఏర్పాటు చేసి అపర్ణ సరోవర్‌లో ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారని నిర్వాహకురాలు చందన తెలిపారు. సరోవర్‌లో 2016 నుంచి ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి సరోవర్‌లో ఉన్న దేశంలోని అన్ని ప్రాంతాల వారు ఉత్సాహంగా పాల్గొంటారని, ఈ నెల 2వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రబలను మహిళలు, చిన్నారులు కూడా ఊరేగింపులో మోసేందుకు ఆసక్తి చూపడం ప్రత్యేకం. ఈశ్వరుడిని ప్రబలపై ఉంచి మేళాతాళాలు, కోలాటాలతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ రాథోడ్ అన్నారు. మేడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్‌సెక్షన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ సహకారంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరామ్ మేడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



'ఐఎస్‌పీ చేంజ్ మేకర్స్' పోటీల్లో విద్యార్థుల సత్తా



ప్రదర్శిస్తున్న శేరిలింగంపల్లి శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు

శేరిలింగంపల్లి: ఇంటర్నేషనల్ స్కూల్స్ పార్టనర్‌షిప్ (ఐఎస్‌పీ) చేంజ్ మేకర్స్ పోటీల్లో శేరిలింగంపల్లిలోని శాంటామారియా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రాజెక్టులు ఉత్తమంగా నిలిచాయి. వీరు సమర్పించిన 'మర్యాద పూర్వక సంభాషణల క్రూసేడ్, ఈట్‌వైజ్' ప్రాజెక్టులు గ్రాంట్లు కూడా పొందడం విశేషం. ఈ సందర్భంగా విద్యార్థి వనికా మాట్లాడుతూ ఈట్‌వైజ్ ప్రాజెక్టుతో ప్రతి భోజనంలోనూ మార్పు తాలుకా అద్భుతమైన శక్తిని స్వీకరించానన్నారు. ఇది తినడం గురించి మాత్రమే చెప్పదని మార్పును ఎంచుకోవడంతోనే ఆరోగ్యకరమైన దిశలో అడుగులు పడతాయన్నారు. ఈ సందర్భంగా శాంటా మారియా స్కూల్ ప్రిన్సిపాల్ రుచిరా ఘోష్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

- పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



బొంతపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల, జిన్నారం మండలాల పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం, గుమ్మడిదల, సోలక్‌పల్లి, ఇమాంనగర్ గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి మరిన్ని పరిశ్రమలు ముందుకు రావాలని సూచించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, హుస్సేన్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు: మహనీయుల జీవితాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నితీషా, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలి

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమలు ముందుకు రావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రుద్రారంలో ఎంవైకే లాటిక్రేట్ సంస్థ సౌజన్యంతో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం, ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడీ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తోషిబా పరిశ్రమ సహకారంతో రూ.కోటి నిధులతో చేపట్టనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం, ఆర్వో ప్లాంట్ల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పాండు, సంస్థ ముఖ్య ప్రతినిధులు శ్రీకర్, రోహిత్, సూర్యప్రకాష్, ఉపసర్పంచ్ యాదయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌తో పాటు మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తే కఠిన చర్యలు

శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్



శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్

హఫీజ్‌పేట్ : గంజాయి చాక్లెట్ల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, రెండు, మూడుసార్లు గంజాయి కేసుల్లో పట్టుబడితే పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని తెలిపారు. యువత గంజాయి చాకెట్లపై అప్రమత్తంగా ఉండి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. వీకర్ సెక్షన్లలో గంజాయి చాకెట్లు విక్రయిస్తే వెంటనే తమకు సమాచారం అందించేందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని విషయాలు 'సాక్షి' చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూలో..

సాక్షి : శేరిలింగంపల్లి మండలంలో ఇప్పటివరకు ఎంత గంజాయిని పట్టుకున్నారు?

సీఐ లక్ష్మణ్ గౌడ్ : శేశేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆరు నెల్లలో సుమారు 200 కిలోల గంజాయిని పట్టుకున్నాం. దీనికి కొన్నిరోజుల క్రితమే రంగారెడ్డి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం కూడా అందుకున్నాను.



సాక్షి : ఇప్పటివరకు ఎన్ని కేసులు పెట్టారు ?

సీఐ : గంజాయి కాకుండా గంజాయి చాక్లెట్లు, అక్రమంగా వైన్, వీదేశీ మద్యం తయారు చేస్తున్న వారిపై 72 కేసులు నమోదు చేసినం. అలాగే 5 పీడీయాక్టు కేసులు కూడా పెట్టినం

సాక్షి : మండలంలో ఎన్ని వైన్స్, బార్లు ఉన్నాయి ?

సీఐ : మండలంలో 39 వైన్స్‌లు , 112 బార్లు ఉన్నాయి. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటాం.

సాక్షి : యువత కోసం ఏమైనా అవగాహన సదస్సులు నిర్వహించారా?

సీఐ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యువత చెడుమార్గంలో నడవకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినం. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా గమనిస్తుండాలి.

సాక్షి : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నూతన భవనం నిర్మాణం ఎప్పుడు చేస్తారు?

సీఐ : ప్రస్తుతం చందానగర్‌లో ఉన్న శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతున్నది. గత ప్రభుత్వం మండలంలోని గోపన్‌పల్లి సర్వే నంబర్ 37లో 600 గజాల స్థలాన్ని కేటాయించింది. ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగనున్నది. 'సక్సెస్ డ్రివెన్ స్ట్రాటజీ' ఫర్ ఎఫెక్టివ్ ప్రొఫెషనల్ అండ్ పర్సనల్ లైఫ్' అనే అంశంపై అమెరికాలోని వర్జినియా సీఓఓ, అధ్యక్షుడు పవన్‌కుమార్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా ఈ నెల 1న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ బుధవార ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు హిల్‌రిడ్జ్ విల్లాస్, హిల్‌రిడ్జ్ అపార్ట్‌మెంట్స్, టిమ్స్, ఎల్లా హోటల్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు టీఎన్‌జీవోస్ ఫేజ్-1, ఫేజ్-2 తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఇక్రిశాట్ కాలనీ, అయ్యప్ప స్వామి టెంపుల్ దగ్గర, ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలు .
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, శ్రీదేవి థియేటర్, జవహర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

న్యూ కాలనీ, నందమూరి నగర్ ఫీడర్‌లో..

మియాపూర్: న్యూ కాలనీ, నందమూరినగర్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 1న (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ హరీష్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు న్యూ కాలనీ, వర్టెక్స్ విరాట్, లక్ష్మీనగర్, మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 గంటల వరకు నందమూరినగర్, హైదర్‌నగర్ మెయిన్‌రోడ్డు, జమ్ మోటర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరిస్తున్న వి.జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ భూముల కబ్జాలు, చెరువుల అన్యాక్రాంతం విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీఎం సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జోనల్ కమిషనర్‌కు పూలమొక్కను అందిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన స్నేహశబరీష్‌ను గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందించి సన్మానించారు. అలాగే గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మౌలిక వసతుల కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో ముగిసిన యూజీసీ ఎంఎంటీటీసీ రీఫ్రెషర్ కోర్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూజీసీ ఎంఎంటీటీసీ ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్‌లో రీఫ్రెషర్ కోర్సు బుధవారం ముగిసింది. ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో రెండువారాల పాటు సాగిన రీఫ్రెషర్ కోర్సును జనవరి 16న ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 54 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. పర్యావరణ శాస్త్రంలోని తాజా అంశాలు, ఇతర విషయాలపై అధ్యాపకులకు ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. 48 సెషన్లతో కూడిన ఈ కార్యక్రమంలో 12 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 8 రాష్ట్ర విశ్వవిద్యాలయాల నుంచి రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. ముగింపు సమావేశంలో యూజీసీ ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా, ప్రొఫెసర్లు, యూజీసీ ఎంఎంటీటీసీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువు కుంటలను కాపాడాలి

జిన్నారం(పటాన్‌చెరు): చెరువులు, కుంటలను కాపాడేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామంలో మత్స్యకారుల సంఘాల అధ్యక్షులను జిల్లా ఫిషరీస్ సొసైటీ అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్టల రవీందర్ మాట్లాడుతూ ప్రధాన జీవనాధారమైన చెరువులు, కుంటలను కాపాడటంతో పాటు మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మత్స్య సహకార సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి

మియాపూర్: ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బి.శ్యామ్ (65) మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట వైశాలీనగర్ కాలనీలో నివాసముంటూ స్థానికంగా ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం మంజీరా రోడ్డు దాడుతుండగా ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్యామ్ కిందపడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.